

ABN ఆంధ్రజ్యోతి

కడప రాయచోటి.. రాజంపేటల్లో
రేపే ముగ్గుల పోటీలు



కడప, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం కడప, రాయచోటి, రాజంపేటలలో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్)లో, రాజంపేటలో శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికయ్యే ఇద్దరు.. మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.



బిగిసిన పిడికిలి

- ప్రభుత్వంపై పెల్లుబుకుతున్న నిరసనలు
- కొనసాగుతున్న అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల సమ్మె
- ఇప్పటికే యూటీఎఫ్ ఆందోళనలు
- త్వరలో అదేబాటలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు

వైసీపీ ప్రభుత్వంపై కార్మికులు, ఉద్యోగులు పిడికిలి బిగించారు. ఇప్పటికే పలువర్గాలు ఆందోళనబాట పట్టాయి. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాడో పేడో అనే రీతిలో సమ్మెబాట పట్టారు. గ్రామస్థాయిలోని అంగన్వాడీలు, ఆశా వర్కర్ల మొదలు మున్సిపల్ కార్మికులు, యూటీఎఫ్ ఉపాధ్యాయులు ప్రభుత్వతీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్నిరోజులుగా ఎటు చూసినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మారుమోగుతున్నాయి. తాజాగా ఇదే బాటలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆందోళనబాట చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారని సమాచారం.

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5: వేతన జీవులు భగ్గుమంటున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అంగన్వాడీలు రోడ్డెక్కారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినదిస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు అన్నట్లు పలు శాఖల వారు ఉద్యమ బాట పడుతున్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకండా పోయింది. లక్షలాది మందితో ఉద్యమాలు చేసినా ఆశించిన పరిష్కార మార్గాలు రాలేదు.

వీటితో పాటు ప్రస్తుతం అంగన్వాడీ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని పూర్తిగా సమ్మెలోకి వెళ్లారు. ఇదే కోవలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కారం కోసం ముందడుగు వేయనున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై ఉద్యోగ సంఘాల నుంచి ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని సమాచారం.

దాచుకున్న డబ్బులూ ఇవ్వడం లేదు

రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా పీఆర్సీ 23 శాతం ప్రకటించినా ఒప్పుకోలేక ఒప్పుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు ఇప్పటికీ అందకపోవడం వల్ల లక్షలాది రూపాయలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాగే గత మూడు దఫాలుగా బకాయిలు కూడా చెల్లించడంలో ప్రభుత్వం వెనుకంజలో ఉంది. దీనిపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సంఘాలు తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఫలితం లేదు. బకాయిల రూపంలో ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాలు లక్షల్లో ఉన్నాయని చెబుతున్నారు. అలాగే వారు దాచుకున్న డబ్బులకు కూడా దిక్కులేకుండా పోయిందని, ఏపీజీఎల్ఐ పీఎఫ్ రుణాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. పీఆర్సీ గడువు 2023 జూలై నాటికి పూర్తయినా ఎటువంటి ఐఆర్ ప్రకటించకపోవడం శోచనీయమని ఉద్యోగ ఉపాధ్యాయులు వాపోతున్నారు. అక్కడ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఐఆర్ ప్రకటించినా ఇక్కడ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

పదోన్నతులు రాకుండానే..

ఎన్నో ఏళ్ల నుంచి పెండింగులో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనలను ఉపాధ్యాయులకు కల్పించడంలో ప్రభుత్వం తగినంత చొరవ తీసుకోలేదని వాపోతున్నారు. దీంతో పదోన్నతులు రాకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. వివిధ రకాల యాప్‌లతో బోధనకు ఆటంకం కలుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో ఉపాధ్యాయులు పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పాలి. మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల కల్పనలో అలసత్వం జరుగుతోంది. మున్సిపాలిటీ ఉపాధ్యాయులను పాఠశాల విద్యలో విలీనం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో వీరికి ఫలితం దక్కకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉత్తుత్తి హామీలు కాదు..

ఇప్పటికే పెండింగులో ఉన్న రెండు మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఐఆర్‌ను కనీసం 30 శాతానికి తగ్గకుండా ఉత్తర్వులు ఇవ్వాలని, నగదు రహిత చికిత్సను ఆరోగ్యశ్రీకి సమానంగా రూ.25 లక్షలు ప్రతి సంవత్సరం పెంచాలని అన్ని రకాల జబ్బులకు రాష్ట్రంలో ప్రముఖ వైద్యశాలలతో పాటు పొరుగురాష్ట్రాల్లో ఉన్న ప్రధాన వైద్యశాలలో చికిత్స చేయించుకునే విధంగా చర్యలు చేపట్టి ఉత్తర్వులు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో ఉన్న పింఛనుదారులకు ప్రతి నెలా సకాలంలో పింఛను చెల్లించకపోవడంతో వీరు ఇబ్బంది పడుతున్నారు. ఉత్తుత్తి హామీలు, బటన్ నొక్కడం కాకుండా ఉద్యోగుల సమస్యలు పరిష్కార దిశలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని లేదంటే తిరుగుబావుట ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పవచ్చు.

గుండు కొట్టించారు

- అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామంటూ నమ్మించి గొంతుకోశారు
- బెదిరింపులకు భయపడం
- ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే..
- అంగన్వాడీ, మున్సిపల్ కార్మికుల హెచ్చరిక
- జిల్లా వ్యాప్తంగా వినూత్న నిరసనలు



ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌లు పనిచేయలేదంటూ జమ్మలమడుగులో వాటికి పూజ చేస్తున్న అంగన్వాడీలు



కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గుండు కొట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మున్సిపల్ కార్మికులు



ప్రొద్దుటూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి సీఎం అయిన తరువాత మాకు గుండు కొట్టారంటూ మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకు విధుల్లో చేరబోమని అంగన్వాడీలు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు.

మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ కన్నా వెయ్యి అదనంగా ఇస్తామని అంగన్వాడీలను నమ్మించి మోసం చేశారు. అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు అనేది ఉండదు. అందరికీ రెగ్యులర్ చేస్తామంటూ ఓట్ల కోసం హామీ ఇచ్చారు. అయితే జగన్ సీఎం అయి నాలుగున్నరేళ్ల దాటుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఎన్నిసార్లు అడిగినా చర్చల పేరిట కాలయాపన చేస్తూ వచ్చారు. చివరికి విసుగెత్తి అటు అంగన్వాడీలు ఇటు మున్సిపల్ కార్మికులు ఆందోళనబాట పట్టారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన జగన్ ఇప్పుడు వారి పదోతరగతి సర్టిఫికెట్లు పరిశీలిస్తామంటూ అనుకూల, సోషల్ మీడియాలో లీకులు ఇస్తూ సమ్మెను భగ్నం చేయాలనుకున్నారు. ఏం చేసినా సరే తగ్గం.. సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ, ఇతరత్రా డిమాండ్లు అమలు చేయాలంటూ కోరుతున్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. ప్రొద్దుటూరులో ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేశారు. వేంపల్లెలో మోకాళ్లపై కూర్చుని నిరసన చేయగా పోరుమామిళ్లలో గోవిందనామాలు పెట్టుకుని పంగనామాలు పెట్టారంటూ నిరసన తెలిపారు. కొండాపురంలో చేతుల్లో వేపాకు మండలు పట్టుకుని అమ్మవారిలా నిరసన తెలిపారు. బద్వేలులో రెండు చేతులతో దండాలు పెడుతూ నిరసన తెలిపారు. చాపాడు, ఎర్రగుంట్లలో ముద్దనూరులో సమ్మె కొనసాగించారు. జమ్మలమడుగులో తమకు ఇచ్చిన మొబైల్‌లు పనిచేయలేదని ఇవి పూజకు కూడా పనికిరావు అంటూ వాటిపై పూలు చల్లి నిరసన తెలిపారు.

ఇక మున్సిపల్ కార్మికుల సమ్మె 11వ రోజుకు చేరుకుంది. జగన్ హామీలు ఇచ్చి అమలు చేయకుండా తమకు గుండు కొట్టించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట గుండుకొట్టుకుని నిరసన తెలిపారు. జమ్మలమడుగు, మైదుకూరులో ఆందోళన కొనసాగించారు. బద్వేలులో మున్సిపల్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలు పెట్టారు. ఇప్పటికైనా సీఎం వైఎస్ జగన్ స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



బద్వేలు మున్సిపల్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలు



ఎర్రగుంట్లలో..

కడపలో ఆందోళన





వేంపల్లెలో మోకాళ్లపై కూర్చుని అంగన్వాడీల నిరసన

ప్రజల ఆస్తులకు భంగం కలిగే చట్టాలను వెంటనే రద్దుచేయాలి

వేంపల్లె, జనవరి 5: ప్రజల ఆస్తులకు భంగం కలిగే చట్టాలను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం న్యాయవాదులందరు కలిసి వైఎస్ సమాధి వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు అబీద్ హుస్సేన్, నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రమేశ్, మాధవయ్య, వరదరాజులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ సమాధి వద్ద వినతి పత్రం సమర్పించిన న్యాయవాదులు

శ్రీరామ్ ఫైనాన్స్ మహిళా ఉద్యోగి చేతివాటం

- బంగారు తాకట్టు పేరుతో.. రూ.3కోట్లు మేర స్వాహా

కడప (క్రైం), జనవరి 5: శ్రీరామ్ ఫైనాన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఖాతాదారులకు టోపీ పెట్టింది. బంగారు నగలను తాకట్టు పెట్టించి కస్టమర్లకు వడ్డీ డబ్బు ఆశగా చూపి ఏకంగా వారినే బాధితులుగా చేసి దాదాపు రూ.3 కోట్ల మేర కాజేసింది. తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌ను కలిసి తమ ఆవేదన వెల్లబోసుకున్నారు. దీనిపై విచారణ చేపడతామని డీఎస్పీ హామీ ఇచ్చారు. బాధితుల కథనం మేరకు..

కడప నగరంలోని అక్కాయపల్లెకు చెందిన సౌజన్య (33) అప్సరా సర్కిల్ సమీపంలోని శ్రీరామ్‌ఫైనాన్స్ కార్యాలయంలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. తమ కార్యాలయానికి వచ్చే కస్టమర్లను తన మాటలతో ఆకట్టుకునేది. తమకు గోల్డ్ లోన్‌లు చేయించాలనే టార్గెట్ ఉందని, ఎవరైనా బంగారు ఆభరణాలను తమ సంస్థలో తాకట్టు పెడితే తాను వడ్డీ వేసి నెల లేదా 15 రోజుల్లోనే విడిపిస్తానని నమ్మబలికేది. ఈ క్రమంలో బాధితులు ఆమె మాటలు నమ్మి వడ్డీలకు ఆశపడి తమ ఇళ్లలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకు వచ్చి తాకట్టు పెట్టారు. ఆ డబ్బులో కొంత వారికిచ్చి మిగిలిన డబ్బంతా వడ్డీ ఇస్తానంటూ మహిళా ఉద్యోగి తీసుకునేది. ఇలా చాలా రోజులుగా ఒకరికి తెలియకుండా ఒకరినుంచి బంగారు తీసుకుని తాకట్టు పెడుతూ వచ్చింది. ఇలా దాదాపు రూ.3 కోట్ల మేర స్వాహా చేసింది. ఈ క్రమంలో కొందరు తమ బంగారు ఆభరణాలను తాకట్టు నుంచి విడిపించాలని ఆమెను నిలదీశారు. కొందరు సంస్థ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. వారి పేరుతోనే బంగారు ఆభరణాలు తాకట్టులో ఉన్నాయని డబ్బు చెల్లించి ఆభరణాలను విడిపించుకుని వెళ్లాలని అధికారులు తేల్చడంతో ఖాతాదారులు ఖంగుతిన్నారు. ఈ విషయంపై మహిళా ఉద్యోగి సౌజన్యను నిలదీసేందుకు బాధితులు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. దీనికి తోడు గత నెల 16వతేదీ నుంచి తన భార్య కనిపించడంలేదని సౌజన్య భర్త నిత్యానందరావు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని బాధితులు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టి న్యాయం చేస్తామని శుక్రవారం తమ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. కాగా పోలీసుల అదుపులో సౌజన్య ఉన్నట్లు తెలుస్తోంది.



ఖాతాదారులను మోసం చేసిన సౌజన్య

పులివెందులకు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు

పులివెందుల, జనవరి 5: రాష్ట్రస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పులివెందులకు అవార్డు దక్కింది. జాతీయస్థాయిలో ఐదు స్వచ్ఛనగరాలుగా అవార్డులు ప్రకటించగా ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలతో పాటు రాష్ట్రస్థాయిలో పులివెందుల మున్సిపాలిటీకి అవార్డు దక్కింది. ఈనెల 11వ తేదీన రాష్ట్రపతి చేతులమీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను అందుకోనున్నారు. పులివెందుల 2022లో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డును, 2023లో స్టేట్ అవార్డులను దక్కించుకుంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 5: అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో సేవలు అందిస్తున్నామని జేసీ గణేశ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి నుంచి అర్హులై ఉండీ పలు కారణాల చేత పథకాల లబ్ధి పొందలేక పోయిన వారి బ్యాంకు ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి నగదు జమ చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీతో పాటు సంక్షేమ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో 3,621 మంది లబ్ధిదారులకు రూ.5.34 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

జిల్లాలో అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని జేసీ జి.గణేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా మీడియా జర్నలిస్టు హౌసింగ్ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ జీవో నెంబరు 535లో నిబంధనల మేరకు అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి గురుపూజా మహోత్సవాలు





అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతుల దంపతులు, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 5: ఈశ్వరీ మహాదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినం కావడంతో అమ్మవారి దర్శనంకోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం ఈశ్వరీదేవికి మఠాధిపతి దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, సారె అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ జేఏసీ చైర్మన్ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, ఈశ్వరీదేవి మాత మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, సుశీలమ్మ, విశ్వబ్రాహ్మణ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా : పుట్టా

బ్రహ్మంగారిమఠాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవల నిర్మాణం చేపట్టిన అన్నదాన సత్రానికి వెళ్లారు. అక్కడ విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ఘనంగా శాలువా, పూల మాలతో సన్మానించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజలు ఒక్కసారి అవకాశమిస్తే ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నేతలు ప్రభాకర్‌యాదవ్, పెనల ఈశ్వర్‌రెడ్డి, సన్నపూరి శ్రీను, సర్పంచ్ నారాయణ, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, మీసాల దుగ్గిరెడ్డి, మల్లేపల్లె రమణయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి హాజరయ్యారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామినీ దర్శించుకున్నారు.

గ్యాస్ గోడౌన్ తనిఖీ



సిలిండర్ల స్టాకును పరిశీలిస్తున్న వీఆర్వోలు

పెనగలూరు, జనవరి 5: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్ ఫిర్యాదుతో శుక్రవారం పెనగలూరు తహసీల్దారు శ్రీధర్‌రావు బృందం పెనగలూరు లోని ప్రగతి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌ను తనిఖీ చేసింది. గోడౌన్‌లోని సిలిండర్లను, కార్యాలయంలోని రికార్డులను, ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బీజేపీ జాతీయ ప్రతినిధి గ్యాస్ పథకం అమలుపై ఆరా తీశారు. సంబంధిత అధికారులు గానీ, సిబ్బంది గానీ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గానీ అందుబాటులో లేకపోవడంతో ఆయన వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు పెనగలూరు తహసీల్దారుకు గోడౌన్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో బ్లాక్ బోర్డుపై ప్రజలకు తెలిపే వివరాలు, గోడౌన్‌లో ఉన్న ఫుల్ సిలిండర్లు ఖాళీ సిలిండర్ల నిల్వల్లో తేడాలు గుర్తించారు. స్టాక్ రిజిస్టరులో ఉన్న వివరాలతో పాటు కంప్యూటర్‌లో ఉన్న వివరాలను కూడా పరిశీలించారు. 112 సిలిండర్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కాగా, వికసిత్ భారత్ కార్యక్రమంపై గ్యాస్ యజమానికి గానీ, సిబ్బందికి గానీ ఈ కార్యక్రమ నోడల్ అధికారి సమాచారమివ్వలేదని తెలిసింది. గోడౌన్ తనిఖీలో ఆర్ఐ చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్‌కు మాతస్వామి, వీఆర్వోలు మౌలానా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 5: ఆలయం ముందు నమస్కారం చేసుకుంటున్న వ్యక్తిని సిమెంటు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణానికి చెందిన దాడిశెట్టి నాగేంద్ర (36) తన తండ్రితో కలసి వ్యాపారం నిమిత్తం శుక్రవారం ఐర్ వాహనంలో వెళుతూ పాతబస్టాండ్ బలిజపల్లి గంగమ్మ ఆలయం వద్ద వాహనాన్ని ఆపి అమ్మవారికి నమస్కరిస్తుండగా ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో నాగేంద్ర అక్కడిఅక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేకోడూరు ఎస్ఐ-2 వెంకటేశ్వర్లు తెలిపారు.

గండికోట బ్యాక్ వాటర్‌లోకి 4.7 లక్షల చేపపిల్లలు

కొండాపురం, జనవరి 5: గండికోట బ్యాక్‌వాటర్‌లోకి కొండాపురం సమీపంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 4.7 లక్షల చేపపిల్లలను నీటిలోకి వదిలారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ గండికోట జలాశయంలో చేపలు పట్టే మత్స్యకారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, మత్స్యశాఖ డీడీ శాంతి, తహసీల్దార్ శోభన్‌బాబు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ డిప్లమా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(ఎడ్యుకేషన్), జనవరి 5: వైవీయూలో జర్నలిజం, లలిత కళల విభాగంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరీక్షల సంచాలకులు ప్రొఫెసరు కంకణాల గంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ లో పు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్టుగ్రాడ్యుఏషణ్ డిప్లమా ఇన్ పబ్లిక్ రిలేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం ఫైన్‌ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బ్యాచలర్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఎవరైనా ఈ కోర్సులు చేసేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల తరగతులు పూర్తిగా సాయంత్రం నిర్వహించనున్న నేపథ్యంలో వైవీయూలో పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు కూడా చేరవచ్చుని తెలిపారు.

ఆక్రమణ అడ్డుకున్నందుకు కత్తితో దాడి యత్నం



కత్తితో దాడికి యత్నిస్తున్న కబ్జాదారుడు

ఓబులవారిపల్లె,జనవరి 5: పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని 1150 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించక పోవడంతో శుక్రవారం కొందరు స్థానికులు పనులను అడ్డుకున్నారు. దీంతో కాకర్లవారిపల్లెకు చెందిన గడుపర్తి చెంగయ్య అనే వ్యక్తి మచ్చుకత్తి తీసుకొని దాడికి ప్రయత్నించారని వారు తెలిపారు. తనకు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు అనుకూలంగా ఉన్నారని బెదిరిస్తున్నాడని తెలిపారు.

సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థి



విద్యార్థి రాకేష్, కోచ్ బాలగోవింద్ తివారిని అభినందిస్తున్న డైరెక్టర్

వేంపల్లె, జనవరి 5: సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థి కె.రాకేష్ ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. 53 కేజీల సబ్ జూనియర్ విభాగంలో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటి సౌత్‌జోన్‌కి ఎంపియ్యాడన్నారు. జనవరి 19 నుంచి 21 వరకు తెనాలిలో జరగనున్న సౌత్‌జోన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా కె.రాకేష్, కోచ్ బాలగోవింద్ తివారిని అభినందించారు.

బంగారు చోరీ

చాపాడు, జనవరి 5: మండలంలోని మొరాయిపల్లెలో కొప్పర్ల పుల్లయ్య అనే వ్యక్తి ఇంటిలో ఈ నెల 4న గురువారం రెండున్నర తులం బంగారం చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందన్నారు. పుల్లయ్య కూలీ పనికి వేరే గ్రామానికి వెళ్లగా... అతని భార్య పొలం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులకొట్టి బంగారాన్ని దొంగలించినట్లు తెలిపారు. పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

మైలవరం, జనవరి 5: మండల పరిధిలోని బుచ్చంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు అరెస్టుచేసి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ సరస్వతి తెలిపారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు అరెస్టు



హత్యకేసులో నిందితుల అరెస్టు చూపి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐ యుగంధర్

బద్వేలు టౌన్, జనవరి 5: పట్టణంలోని సిద్దవటం రోడ్డు అగ్నిమాపక కేంద్రం సమీపంలో గురువారం జరిగిన అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐ యుగంధర్‌లు తెలిపారు. చిన్న గొడవ హత్యలకు దారి తీసిందని వెల్లడించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి ప్రశాంత్ (28), పసుపులేటి సాయికుమార్(25) గురువారం ఉదయం మార్కెట్‌యార్డు సమీపంలో ఉండగా సుమిత్ర నగర్‌కు చెందిన లకిడి వెంకట ప్రమోద్‌కుమార్ మధ్య ఘర్షణ జరిగింది. ఇది మనసులో పెట్టుకుని ప్రమోద్‌కుమార్ వెంటనే తన తండ్రి లకిడి విజయభాస్కర్ తమ్ముడు వెంకట తరుణ్‌తేజ్‌కు చెప్పడంతో వారు ఆగ్రహానికి గురై వెంటనే తన స్నేహితులైన భరత్‌కుమార్‌రెడ్డి, గణేశ్, ఉదయ్ కుమార్‌లతో కలసి మూడు ద్విచక్ర వాహనాల్లో వెదుకుతుండగా మృతులు పసుపులేటి ప్రశాంత్, సాయికుమార్‌లు సిద్దవటం రోడ్డులోని నారాయణ టీషాపు వద్ద ఉండడం గమనించి వారిపై దాడికి పాల్పడ్డారు. అన్నదమ్ములిద్దరినీ కత్తితో దాడి చేసి బండరాళ్లతో ఒంటిమీద తీవ్ర గాయాలయ్యేలా కొట్టడంతో అధిక రక్తస్రావం కావడంతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న సాయికుమార్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయం దర్యాప్తు అధికారి సీఐ యుగంధర్ విచారణ చేపట్టి హత్యకు కారకులైన ఆరుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి మూడు ద్విచక్ర వాహనాలను, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అల్లరి మూకలు ఘర్షణలకు పాల్పడినట్లు సమాచారం వస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● 113 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కడప(క్రైం), జనవరి 5: చెన్నూరులో శుక్రవారం విజిలెన్స్ అధికారుల దాడులు నిర్వహించి 113 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. వనం వీధిలోని ఓ ఇంట్లో చెన్నూరుకు చెందిన కాటం బ్రహ్మయ్య అనే వ్యక్తి రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా నిల్వ ఉంచి కర్ణాటకకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచాడనే సమాచారం రావడంతో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఉదయం దాడులు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మసూంబాష ఆదేశాల మేరకు కాటం బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఇంటిని తనిఖీ చేయగా అందులో 5270 కేజీల రేషన్ బియ్యం 113 బస్తాలు ఉన్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.2,13,435గా తేల్చారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని చెన్నూరు ఎంఆర్ఐకి అప్పగించారు. ఆయనపై చెన్నూరు పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, ఏఓ మురళీక్రిష్ణ, పి.సౌజన్య, చెన్నూరు ఎంఆర్ఐ, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, రంతుబాషా తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తాం

● మదనపల్లె డీఎస్పీ కేశప్ప

పెద్దతిప్పసముద్రం, జనవరి 5: ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని కర్ణాటక సరిహద్దులోని పలు చెక్‌పోస్టులను తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని, కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం, రాష్ట్రానికి తరలిరాకుండా సరిహద్దులో కట్టుదిట్టం చేస్తామన్నారు. ఎన్నిక నేపథ్యంలో సంఘ విద్రోహ శక్తులు, రౌడీషీటర్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమాచారం ఉన్నా, పోలీసులకు తెలియజేస్తే తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట సీఐ మధు, ఎస్ఐ రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం - ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జనవరి 5: మద్యం బాటిళ్లతో పాటు ఇరువురిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ రామాంజనేయుడు శుక్రవారం వెల్లడించారు. ఎస్ఐ కథనం మేరకు పెద్దమండ్యం మండలం బండ్రేవు గ్రామ పంచాయితీ కొత్తపల్లికు చెందిన రమణయ్య, నాగభూషణం ఇద్దరు పెద్దమండ్యం సమీపంలోని పంప్‌హౌస్ వద్ద 180 ఎంఎల్ స్థాయి కలిగిన 60 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే మండలంలోని దిగువపల్లి పాపాఘ్ని నదిలో ఇసుక తరలిస్తుండగా ఒక ట్రాక్టర్‌ను, ఒక ఇటాచీ యంత్రాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు, అపరిచితుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్ఐ ఇసాక్ తెలిపారు.

'బురద చల్లడం హాస్యాస్పదం'

పెండ్లిమర్రి, జనవరి 5: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక బురదచల్లడం హాస్యాస్పదమని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. గురువారం మండలంలోని పగడాలపల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఒక మహిళ తమ సమస్యను తెలుపగా సమస్యను పరిష్కరిస్తామని పుత్తా నరసింహారెడ్డి సమాధానం ఇచ్చారన్నారు. అయితే జగన్ మీడియా మాత్రం వక్రీకరించి విషప్రచారం చేయడం తగదన్నారు.

పర్యాటక కార్యకలాపాలకు ఒప్పందం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5: రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీతో కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల పర్యాటక శాఖ విస్తృత కార్యకలాపాల నిర్వహణ కోసం ఒప్పందం చేసుకుంది. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో ఈ మేరకు ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.రమేష్ టూరిజం విభాగాధిపతి ఎస్.శివపార్వతి, గయాజ్‌ల ఆధ్వర్యంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజుతో ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కలిగిన రాయలసీమ టూరిజం సంస్థ ఆరు సంవత్సరాలుగా పర్యాటక రంగం అభివృద్ధికి పలు విభాగాల్లో విశేష కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

మద్యం బాటిళ్ల పట్టివేత

వేంపల్లె, జనవరి 5:వేంపల్లెలోని గాంధీరోడ్డు ప్రాంతంలో 20మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. చట్టవ్యతిరేకంగా మద్యంను అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసిపట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

వేంపల్లె, జనవరి 5: వేంపల్లెలో రోడ్డు భవనాల శాఖ ఆద్వర్యంలో చేపడుతున్న రోడ్డు,కాల్వ పనులను ప్రణాళికాబద్ధంగా,వేగవంతంగా పూర్తిచేయాలని టీడీపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ అధికారులను కోరారు. వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతలోపించిందని, నీళ్లతో క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో నాశిరకంగా మారే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు.

నిధులు కేటాయించాలని వినతి

పెండ్లిమర్రి, జనవరి 5: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఆలయ ఛైర్మన్ అంబటి నాలమల్లారెడ్డి, కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులు కలిసి విజయవాడలోని దేవాదాయ ధర్మాదాయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ఆలయానికి సంబంధించిరాజగోపురం కింద మెట్లు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనుల కోసం కేటాయించాలని నివేదికలు అందించి కోరారు.

రాష్ట్రంలో పెత్తందారీ పాలన

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



జయకేతనం చూపుతున్న టీడీపీ వాసు, మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 5 : రాష్ట్రంలో పెత్తందారి పాలన సాగుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి తెలిపారు. 6వ డివిజన్ నెహ్రూనగర్‌లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. టీడీపీ కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, కిరణ్, పార్వతి, జిలానీ బాషా, యాటగిరి రాంప్రసాద్, ఆవుల వెంకటేశ్, సురేష్, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన యువత: కడప నగరం 23వ డివిజన్ నాగరాజుపేటలో టీడీపీ నాయకులు బొమ్మిశెట్టి చంద్ర, దండు అనిల్ ఆధ్వర్యంలో భారీగా యువత టీడీపీలో చేరారు. వారికి టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గౌస్, షారుఖ్. సయ్యద్, శర్వంత్‌రెడ్డి, సాయి, హేమంత్, యశ్వంత్, మౌలా, హబీబ్‌తో పాటు మహిళలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం: పుత్తా





కొప్పర్తిలో మహిళలతో మాట్లాతున్న పుత్తా నరసింహారెడ్డి... చెన్నూరు: కొక్కిరాయపల్లెలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

సీకేదిన్నె, జనవరి 5: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పంచాయతీలో శుక్రవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ చేపట్టబోయే మినీ మేనిఫేస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. మహిళలకు దీపం పథకం ద్వారా సంవత్సరానికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, కుటుంబంలో ఎంత మంది చదివినా అందరికి అమ్మఒడి పథకం, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. చంద్రబాబునాయుడి హయాంలో గతంలో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత చంద్రబాబునాయుడిదేనన్నారు. చంద్రబాబునాయుడు రూ.2 వేలు చేసిన పింఛన్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లలో రూ.250 చొప్పున పెంచుకుంటూపోయి ప్రస్తుతం రూ.3 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, టక్కోలి కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, శ్రీనివాసులరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం చంద్రన్నను గెలిపించండి

చెన్నూరు, జనవరి 5 :రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలని కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బాబుతో భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలు ఎంతో సంతోషిస్తూ టీడీపీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మళ్లీ ఆ పథకాలు అందుకోవాలంటే చంద్రబాబు లాంటి నేతను సీఎం చేసి అభివృద్ధి పథంలో నడవాలన్నారు.

ముఖ్యంగా వైసీపీ పా లనలో పడ్డ ఇబ్బందులు జరిగిన నష్టం రాష్ట్రంలో కోలుకోలేని దెబ్బలాంటిదని, అవన్నీ తొలగాలన్నా, రాష్ట్రానికి పట్టిన పీడ పోవాలన్నా టీడీపీకే సాధ్యమవుతుందన్నారు. అందుకే అందరం ఆ పార్టీని గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకున్నామన్నారు. అలాగే ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు సుధాకర్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, ఎంకెకాంత్, మాజీ సర్పంచ్ నరసింహులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా వాసవీ మాత



వాసవీ మాత దేవస్థానంలో ధనుర్మాసం పూజల్లో పాల్గొన్న భక్తులు

వేంపల్లె, జనవరి 5: వేంపల్లెలోని వాసవీ కన్యకపరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీదేవిగా వాసవీ మాత భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకొని అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర మాట్లాడుతూ మూలవిరాట్ అమ్మవారికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ చేసి, పంచ, నక్షత్ర, కుంభ హారతులు, ప్రాకారోత్సవం నిర్వహించినట్లు వివరించారు. అలాగే ఆర్యవైశ్య మహిళలు రంగవల్లికలతో ముగ్గులు వేశారన్నారు. యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, కళ్యా మండప అధ్యక్షుడు కె.సతీష్, సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి



గ్రామ రైతులతో రైతు సంఘం నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 5: ఎర్రగుంట్లలో నేడు జరిగే ఏపీ రైతు సంఘం 18వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు టి.మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రూకవారిపల్లెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతులను రుణ విమోచన చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, పెండింగులో ఉన్న ప్రాజెక్టులు, పంట కాల్వలు పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.కాటమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు కొండయ్య, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పోస్టల్ సేవలందించాలి

● ఏఎస్పీ రెడ్డిబాషా

కడప (నాగరాజుపేట), జనవరి 5 : ప్రతి కుటుంబానికి పోస్టల్ సేవలందించాలని ఏఎస్పీ ఎస్.రెడ్డి బాషా సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రధాన తపాల కార్యాలయంలో ఏపీ పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తపాల ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో నూతన సంవత్సరంలో పనిచేయాలని అన్నారు. ప్రజలందరికీ తపాలాఫీసులో అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్కన ప్రజలందరి కోసం తపాలా శాఖ విశేష సేవలందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జడా కొండయ్య, కార్యవర్గ సభ్యురాలు అరుణ, డివిజనల్ ప్రెసిడెంట్ ఎం.వెంకటసుబ్బయ్య, ప్రసన్నకుమారి, రాంబాబు, శశికుమార్, నరసింహారెడ్డి, లతీఫ్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులను కాదు.. ఎస్పీడీని సస్పెండ్ చేయాలి: ఒంటేరు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తున్న ఉద్యోగులను సస్పెండ్ చేయాలని చెప్పిన ఎస్‌పీడీనే సస్పెండ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేలుతో పాటు మరెన్నో సదుపాయాలు కల్పిస్తానని సీఎం జగన్‌రెడ్డి చెప్పినా ఇప్పటి వరకు అమలు కానందుకే వారు ఉద్యమబాట పట్టారన్నారు. తమ కడుపు కాలి ధర్నాలు చేస్తున్న ఉద్యోగులకు బాసటగా నిలవాల్సిన ఎస్పీడీ ధర్నాలు చేస్తున్న వారిని విధుల నుంచి తొలగించాలని అధికారులకు సూచించడం దుర్మార్గమన్నారు. ఉద్యమాలు చేసే హక్కు ప్రతి ఉద్యోగికి ఉందని, తమ సమస్యల గురించి ప్రశ్నించే వారిని అణగతొక్కాలని చూస్తే సహించేదిలేదన్నారు.

'అంగన్వాడీలను విధుల్లో చేరాలని బెదిరించడం దారుణం'

కడప (నాగరాజుపేట), జనవరి 5 : విధుల్లో చేరాలని అంగన్వాడీలను బెదిరించడం దారుణమని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం గత 25 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బెదిరించి భయపెట్టి బలవంతంగా విధుల్లో చేరమని చెప్పడం దుర్మార్గ చర్య అన్నారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో గత 25 రోజులుగా అంగన్వాడీలు తమ వేతనాలు పెంచాలని శాంతియుతంగా దీక్షలు కొనసాగిస్తున్నారన్నారు. అంగన్వాడీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే వారిని బెదిరించి విధుల్లో చేరాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల 9న కడప నగరంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసుల రెడ్డి, వేణుగోపాల్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు గోపీ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై మొక్కుతూ అంగన్వాడీల నిరసన

వేంపల్లె, జనవరి 5: అంగన్వాడీ ఉద్యోగులు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసంచేస్తున్న సమ్మె 26వ రోజు కొనసాగింది. వేంపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. వేంపల్లె వేముల, చక్రాయపేట మండలాలకు చెందిన అంగన్వాడీ ఉద్యోగులు మోకాళ్లపైనిల్చుని నిరసన తెలిపారు. సీఎం జగన్ సమస్యలు పరిష్కరించేలా బుద్ధిని ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. సమ్మెను మరింత ఉధృతం చేస్తామని శనివారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు అంగన్వాడీ ఉద్యోగులు స్పష్టం చేశారు.

25వ రోజుకు చేరిన అంగన్వాడీల దీక్షలు

కడప (నాగరాజుపేట), జనవరి 5: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, ఇకపై పోరాటం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సావిత్రి, క్రిష్ణవేణి, గంగోజీ, డీవైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి డీఎం ఓబులేసులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రూరల్, అర్బన్ ప్రాజెక్టు పరిధిల్లో అంగన్వాడీలు దండాలు పెడుతూ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయకపోగా తమ సమ్మెను భగ్నం చేయడానికి పూనుకోవడం బాధాకరమన్నారు. తక్షణం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని, రేపటి నుంచి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్



దండాలు పెడుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 5 : కడప మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా నగరంలో పారిశుధ్య పనులు, నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని మేయర్ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ మేయర్ చాంబరులో కడప డీఎస్పీ షరీఫ్, సీఐ భాస్కర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఈఈ కరీముల్లాఖాన్, శానిటేషన్ సూపర్‌వైజర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేయరు మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో జరుగుతున్న కార్మికుల సమ్మెలో భాగంగా ఉద్యోగులకు ఇబ్బంది పెట్టే విధంగా వారు ప్రవర్తించకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సేవలందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఏమైనా ఇబ్బంది కలిగించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి: ఆర్ఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5 : కడప నగరం వేదికగా ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే ఆర్ఎస్‌యూ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప న గరం ఆర్ఎస్‌యూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ప్ర శాంత్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్ఎస్‌యూ నాయకత్వం హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. అలాగే రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నాయకులు హరి, సుమంత్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి బాసట సాయం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5 : కడప నగర బాసట సేవా సంస్థ దాతల సహకారంతో పులివెందులకు చెందిన కార్తీక్ అనే బీటెక్ విద్యార్థికి రెండో సెమిస్టరు ఫీజుకు సంబంధించి రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. బాసట సభ్యుడు డీపీ కార్తీక్‌రెడ్డి తన సొంత డబ్బును అందజేశారు. ట్రైబల్ ఉమెన్స్ హైస్కూలు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి చేతుల మీదుగా చెక్‌ను అందించారు.

సీఆర్సీని కలిసిన చెన్నూరు టీడీపీ మండల నేతలు



చెన్నూరు, జనవరి 5 : ఎమ్మెల్సీ సీ.రామచంద్రయ్య టీడీపీలో చేరడంపై హర్షం వ్యక్తం చేసిన చెన్నూరు మండల టీడీపీ నేతలు శుక్రవారం కడప నగరంలోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మీ సూచనలు, సలహాలతో మరింత ముందుకు వెళతామని అందుకు తగిన విధంగా మీరు ముందుండి నడిపించాలంటూ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి ఎమ్మెల్సీని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఇందిరెడ్డిశివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, మండల ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, ముండ్లపల్లె ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్లా, టీడీపీ సీనియర్ నేత లేవాకు రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

22వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి

కడప(కలెక్టరేట్), జనవరి 5: నగరంలోని 22వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య డిమాండ్ చేశారు. శుక్రవారం లావణ్య, నగర మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు లోకేశ్వరి, వెంకటసుబ్బమ్మ, సంతోషమ్మ తదితరులు 22 వడివిజన్ లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

కార్మికులను రెచ్చగొడితే పుట్టగతులుండవ్

● వినూత్న రీతిలో నిరసన చేపట్టిన మున్సిపల్ కార్మికులు



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 5 : మున్సిపల్ కార్మికులను రెచ్చగొడితే పుట్టగతులుండవని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు హెచ్చరించారు. శుక్రవారం కడప నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంగనామాలతో నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంటు చేయాలని, సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను పట్టించుకోని జగన్‌రెడ్డి ప్రభుత్వం గోవిందా.. గోవిందా అంటూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, ఇంజనీరింగ్ సెక్షన్‌లో ప్రధానంగా వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ కార్మికులు, చెత్త ట్రాక్టరుపై పనిచేస్తున్న డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్మికులను రెచ్చగొట్టవద్దని, వెంటనే ప్రభుత్వం తన మొండివైఖరి విడనాడి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గున్నా గోవిందు, కంచుపాటి జాన్, కలువాయ్ ఈశ్వరయ్య, చంద్ర, వెంకటాద్రి, రాజశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఆర్టీయూ మద్దతు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 5 : మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు రాయలసీమ ట్రేడ్ యూనియన్ ప్రత్యక్షంగా మద్దతు నిలుస్తుందని రాయలసీమ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరామయ్య వెల్లడించారు. మున్సిపల్ కార్మికుల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆర్టీయూ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్టీయూ జిల్లా కార్యదర్శులు తస్లిమా, లక్ష్మీదేవి, రాయలసీమ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి మడగలం ప్రసాద్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాసిం పాల్గొన్నారు.

'ప్రజలను వంచించిన నాయకులను ఓడించండి'

కడప (మారుతీనగర్), జనవరి 5: అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజలకు మంచి చేయకుండా వంచించిన నాయకులను రానున్న ఎన్నికల్లో ఓడించితీరాలని సంఘసేవకుడు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. గత 5 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న నాయకులంతా దోచుకో.. దాచుకో అనే రీతిగా కడప నగరాన్ని భ్రష్టుపట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక యాకూబ్‌సాబ్ మస్జిద్ వద్ద ప్రజలను కలిసి తనకు ఒకే ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.

తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

పులివెదుల టౌన్, జనవరి 5: పులివెందుల ఏపీఎన్జీఓ తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికైనట్లు ఎన్నికల అదికారి నిత్యపూజయ్య, సహాయ ఎన్నికల అధికారి శ్రీనివాసులు అన్నారు. పులివెదుల ఏపీఎన్జీఓ తాలూకా యూనిట్ ఎన్నికలు స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రామగంగాదర యాదవ్, అసోషియేట్ ప్రెసిడెంట్ సుకుమార్, ప్రభుకుమార్, శంకరయ్య, సుబ్బయ్య, బాలకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా విక్టర్, వెంకటరెడ్డి, అభిలాష్‌రెడ్డి, సరళ, జాయింట్‌సెక్రటరీగా అన్నముల్, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ మాట్లాడారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

● విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయాలని విద్యార్థి, యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండరు, డీఎస్సీ నిర్వహిస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదని ఆవేద నవ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఇప్పటికే యువత ఉద్యోగ అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, తక్షణం ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. లేదంటే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, నగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, సునీల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గోవర్ధన్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 5 : కనిగిరి సభకు హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభినందించారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంటుల పరిధిలో టీడీపీ నిర్వహించనున్న 'రా.. కదలిరా సభలను' ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి చంద్రబాబు ప్రారంభించారు. కనిగిరి సభ నేటి నుంచి ప్రారంభమై ఈ నెల 27 వరకు నిర్వహించనున్నారు. కాగా కనిగిరి సభ అబ్జర్వర్‌గా గోవర్ధన్‌రెడ్డి జన సమీకరణ, సభ ఏర్పాట్లులో పనిచేశారు.

ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం ఆగదు

జమ్మలమడుగు, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న సమ్మె 25వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ప్రభుత్వం ఇచ్చిన నిరుపయోగంగా మారిన సెల్‌లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు లేనిపోని యాప్‌లు పెట్టి ఇబ్బంది కలిగిస్తోందన్నారు. ఇచ్చిన సెల్‌లు (మొబైల్) కనీసం ఫొటోలు తీయడానికి కెమెరా కూడా లేదని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలకుడుగా అనర్హుడు

ప్రొద్దుటూరు, జనవరి 5: అంగన్‌వాడీలు గత 25 రోజులుగా సమ్మె చేస్తుంటే... స్పందించని ముఖ్యమంత్రి జగన్ ప్రజాపాలకుడుగా అనర్హుడని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఒంటికాలిపై నిల్చొని దండం పెడుతూ నిరసన చేపట్టారు. అంగన్‌వాడీవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ఏఐటీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై అంగన్వాడీల నిరసన

మైదుకూరు, జనవరి 5: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందంటూ శుక్రవారం మైదుకూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గత 25 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలకు ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం చేస్తామని అంగన్‌వాడీ నాయకురాళ్లు పేర్కొన్నారు. కాగా, అంగన్వాడీలు చేస్తున్న దీక్షలకు టీటీపీ రాష్ట్ర నాయకుడు పార్థసారథి మద్దతు పలికారు. సీఎం జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే అంగన్వాడీల డిమాండ్లను తక్షణమే ఆమోదించాలని కోరారు.

రెండు చేతులతో దండం పెడుతూ నిరసన

బద్వేలు రూరల్, జనవరి 5: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట రెండు చేతులతో దండం పెడుతూ అంగన్వాడీలు వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి హుసేనమ్మ మాట్లాడుతూ గత 25 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అంగన్వాడీ నాయకులు సుభాషిని, సత్యవతి, నాగమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని గోవిందనామాలు

పోరుమామిళ్ల, జనవరి 5: జీతాలు పెంచేంత వరకు అంగన్వాడీల పోరాటం ఆగదని సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గోవిందనామాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, మేరీ, దస్తగిరమ్మ, జ్యోతమ్మ, రేణుక, రమాదేవి, విజయమ్మ, శ్రీదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిదారిన వెళ్లిన ఎమ్మెల్యే

ముద్దనూరు జనవరి 5: సీఎం జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దీక్షలు చేస్తుంటే.. ఎక్కడ అడ్డుకుంటామోనని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దొడ్డిదారిన వెళ్లారని అంగన్వాడీ నాయకురాలు చంద్రకళ ఎద్దేవా చేశారు. స్థానిక తహసీల్ధారు కార్యాలయం ఎదుట 25వ రోజు శుక్రవారం అంగన్వాడీల దీక్షలు కొనసాగాయి. అయితే బాలుర ఉన్నత పాఠశాల వద్ద నిర్వహిస్తున్న పెంచిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాల్సిన ఎమ్మెల్యే అంగన్వాడీల కంట పడకుండా పక్కదారిన వెళ్లటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు దీక్ష కొనసాగిస్తామన్నారు.



మైదుకూరులో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన



బద్వేలులో రెండు చేతులతో దండం పెడుతూ...

కొనసాగుతున్న అంగన్వాడీల దీక్ష

ఎర్రగుంట్ల జనవరి 5: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం మొండి వైఖరి విడిచి చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుల మద్దతు

చాపాడు, జనవరి 5: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టీడీపీ నాయకులు మాజీ మండలాధ్యక్షులు దార్ల గురివిరెడ్డి లక్ష్మీపేట గ్రామ మాజీ సర్పంచ్ వీరశేఖర్‌రెడ్డి, ఏఐ టీయూసీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఐ నాయకుడు పల్లవోలు వెంకటరమణ మద్ధతు ప్రకటించారు. ఈ సందర్భంగా గురివిరెడ్డి మాట్లాడుతూ గత 25 రోజులుగా వీరు ధర్నా చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా అన్యాయమన్నారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను సీఎం జగన్ ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ధర్నా కొనసాగించాలన్నారు.

వేపమండలు చేతపట్టి...

కొండాపురం, జనవరి 5: కొండాపురంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు వేపమండలు చేతబట్టి అమ్మవారిలాగా నిరసన వ్యక్తంచేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని నినాదాలు చేశారు.



కొండాపురంలో వేపమండలు చేతబట్టి అమ్మవారిలాగా నిరసన



పోరుమామిళ్లలో గోవిందనామాలతో..

విద్యుత్‌సబ్‌స్టేషన్ ప్రారంభం

పోరుమామిళ్ల, జనవరి 5: మండలంలోని రామాయపల్లెలో నూతనంగా నిర్మించిన 32/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. శుక్రవారం ఆ గ్రామంలో నూతన సబ్‌స్టేషన్‌కు పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మించడం వల్ల గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తొలగిపోతాయన్నారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంటు మెంబరు నాగార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ దేశాయి శారదమ్మ, ఆప్కాస్ స్టేట్‌బోర్డు డైరెక్టరు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం...

బ్రహ్మంగారిమఠం, జనవరి 5 : బ్రహ్మంగారిమఠంలో ఇటీవల పునర్నిర్మాణం చేపట్టిన తహసీల్దారు కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బి.మఠంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని.. సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ, బి.మఠం ఎంపీపీ వీర నారాయణరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందురెడ్డి, తహసీల్దారు సువర్ణదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

ముద్దనూరు జనవరి 5: మండలంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను శుక్రవారం మండల వ్యవసాయాధికారి, సెక్టోరియల్ అధికారి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. తిమ్మాపురం, రాజులగురువాయపల్లె గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు గాలి, వెలుతురు, కరెంటు, టాయిలెట్లు, నీటి వసతులను పరిశీలించారు. రూట్ మ్యాప్‌పై బీఎల్‌వోల ద్వారా ఆరాతీశారు. కార్యక్రమంలో వీఆర్‌వో, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

షర్మిల నిర్ణయం సాహసోపేతం

పోరుమామిళ్ల, జనవరి 5: వైఎస్ షర్మిల తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనలో భాగంగా కాంగ్రెస్ పార్టీలో చేరి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీని ఇతర పెద్దలతో కలిసి నడిపించేందుకు ఆమెను తాము స్వాగతిస్తున్నామన్నారు.

అందమైన చేతిరాత పోటీలు

కాశినాయన జనవరి 5: పిట్టిగుంట పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చేతిరాతపై పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రతివిద్యార్థికి అందమైన చేతిరాత అవసరం ఎంతైనా ఉందని ప్రధానోపాధ్యాయుడు వి.సత్యనారాయణ, చేతిరాత నిపుణుడు మల్లీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చేవరకు సమ్మె వీడం

● మున్సిపల్ కార్మికుల హెచ్చరిక

ప్రొద్దుటూరు, జనవరి 5: మున్సిపల్ కార్మికులకు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు సమ్మె వీడమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మన్‌లు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపడుతున్న సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కార్మికులు భిక్షాటన చేసి రోడ్డుపై భోజనాలు చేశారు. కార్మికుల సమ్మెకు ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్ర, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మక్కలు మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు ఎప్పుడూ బతికి బట్టకట్టలేదని.. త్వరలోనే ఈ ప్రభుత్వం ఇంటిబాట పట్టక తప్పదన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాఘవేంద్ర, ఉపాధ్యక్షురాలు గుర్రమ్మ తదితతరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో రోడ్డుమీద అన్నం తింటూ నిరసన చేపట్టిన కార్మికులు

ప్రభుత్వం స్పందించేవరకు పోరాటం

జమ్మలమడుగు, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేసేవరకు సమ్మె కార్యక్రమం ఆగదని మున్సిపల్ వర్కర్లు హెచ్చరించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని మస్టర్‌పాయింట్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు 11వ రోజు సమ్మె చేశారు. 11 రోజుల నుంచి సమ్మె కొనసాగుతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం చురకలేదన్నారు. మున్సిపల్ వర్కర్ల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు మద్దతుగా కూర్చున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా కూర్చున్న కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

మైదుకూరు, జనవరి 5: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కింద 26 వేలు ఇవ్వాలని, బకాయిపడ్డ వేతనాలు చెల్లించడంతో పాటు సీపీయస్ రద్దు చేసి ఏపీయస్ విధానంలో పెన్షన్లు ఇవ్వాలని, కార్మికుందరికి ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్లపై సమ్మె చేపడుతున్నటు నాయకులు వెంకట సుబ్బయ్య, కళ్యాణ్, చిన్న ఓబులేసు ఆదినారాయణ, బండి రాజ, చెంద్రాయుడు తదితరులు పేర్కొన్నారు.



మైదుకూరులో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పొర్లుదండాలతో కార్మికుల నిరసన

బద్వేలు, జనవరి 5: ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ మున్సిపల్ ఉద్యోగ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజు కొనసాగింది. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ పొర్లుదండాలతో కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాం ప్రవీణ్, కోశాధికారి శివకుమార్, కార్యనిర్వాహకఅధ్యక్షులు హరి, ఉపాధ్యక్షులు దేవమ్మ, గంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీయూ ఆధ్వర్యంలో మొక్కలు నాటు కార్యక్రమం

ఎర్రగుంట్ల జనవరి 5: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎన్టీయూ) ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొని పోట్లదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటు కార్యక్రమం చేపట్టారు. మొక్కలు మానవ మనుగడకు ఎంతో ఆధారమన్నారు. కార్యక్రమంలో ఎన్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లతో పనిచేస్తే ఇంటికే..

● టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 5: అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో ఎన్నికల విధులు నిర్వహిస్తే అధికారులు ఇంటి బాట పడతారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బూత్‌ల వారీగా ఉన్న దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లను ప్రత్యేక టీంలు వేసి సమాచారం సేకరించానన్నారు. వీటిపై స్థానిక ఎన్నికల అధికారికి ఫిర్యాదులు చేసినా.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వాటని తొలగించ కుండా వ్యవహరించారన్నారు. అందువల్లే ఢిల్లీకి వెళ్లి చీఫ్ ఎన్నికల కమిషన్ కలిసి జాబితాను వారికి అందజేశానన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్ విచారణ జరిపి వాస్తవాలు ధ్రువీకరించుకున్నాక ప్రొద్దుటూరు ఈఆర్‌వోను సస్పెండ్ చేసింద న్నారు. నాపై అక్రమ కేసులు పెట్టినా ఊరుకున్నానని.. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తే సహించనన్నారు. ప్రొద్దుటూరులో టూటౌన్ సీఐ ఇబ్రహీం అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరి స్తున్నారని.. అతనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. త్వరలో మరింత మందిపై వేటు పడుతుందన్నారు.

అభాగ్యురాలైన అవ్వ మృతి

పోరుమామిళ్ల, జనవరి 5: రంగసముద్రం సత్రం వద్ద గత ఆదివారం కన్నకొడుకే తల్లిని వదిలేస్తే వివేకానంద సేవాశ్రమ వ్యవస్థాపకులు రామక్రిష్ణరెడ్డి, రామతులసిలు అక్కున చేర్చుకున్న విషయం విదితమే. ఆ అభాగ్యురాలైన అవ్వ శుక్రవారం కన్నుమూసింది. సేవాశ్రమం నిర్వాహకులు ఎం.రామతులసి ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుమీద దుర్భర జీవితం గడుపుతూ ఒళ్లంతా పురుగులు పారాడుతున్న ధనలక్ష్మి అనే అవ్వను ఆశ్రమానికి తీసుకువచ్చినా కేవలం నీరు తప్ప మరేం తినలేని స్థితిలో ఉండేదని, విషయం బద్వేలు ఆర్డీవో వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లినా ఆమె కుటుంబం కోసం ఎటువంటి సమాచారం అందలేదన్నారు. అనారోగ్యంతో మరణించిన ఆమెకు వివేకానంద ఫౌండేషన్ ప్రతినిధులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

మోటరు బైకులు ఢీ.. వృద్ధుడికి గాయాలు

పోరుమామిళ్ల, జనవరి 5: మండలంలోని మార్కాపురం వద్ద రెండు మోటరుబైకులు ఢీకొనడంతో సుంకేసులపల్లెకు చెందిన శ్రీనివాసులు అనే వృద్ధుడికి గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం మార్కాపురం నుంచి సుంకేసులపల్లెకు మోటరు బైకులో గడ్డిని తీసుకెళుతుండగా ప్రమాదం జరిగింది. గాయపడ్డ వ్యక్తిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.



జగన్ నియంత పాలన ఇక సాగదు : పుట్టా

● వైసీపీ నుంచి టీడీపీలోకి 250 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఖాజీపేట, జనవరి 5: జగన్‌మోహన్‌రెడ్డి నియంత పాలన ఇక సాగదని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన వైసీపీ ఉపమండలాధ్యక్షుడు డీఎస్ భాస్కర్‌రెడ్డి, ఖాజీపేట బీచువారిపల్లె రోడ్డులోని రాజేష్‌కుమార్‌రెడ్డి (చిన్నలు)ల ఆధ్వర్యంలో దాదాపు 250 కుటుంబాలు మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకు ముందు పుట్టాకు పూలు చల్లుతూ, బాణసంచా పేల్చుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్టే అరాచకాలు తట్టుకోలేక వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు మా పార్టీలో చేరుతుంటే కళ్లు ఉండి చూడలేనివారిగా మాట్లాడుతున్నారన్నారు. మండల అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యేను నిలదీసినందుకే భాస్కర్‌రెడ్డిని పార్టీ నుంచి తొలగించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్‌యాదవ్, సిద్దారం కదిరుల్లా, బొగ్గుల చంద్ర ఓబుళరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, ఫరూక్, జండాల మాబాష, జిలానీ, సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతాం : వరద



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 5: రాష్ట్ర ప్రజలపై అన్ని రకాల పన్నుల భారం మోపి ప్రజల నడ్డివిరిచిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతామని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 30వ వార్డు మిట్టమడి వీధిలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి,టీడీపీ కడప పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, వంగల నారాయణరెడ్డి మార్తల గురివిరెడ్డి పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీలపై జనం ఆసక్తి పెరిగింది



కొత్తపల్లె పంచాయతీ ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 5: జగన్ పాలనలో తీవ్రంగా మోసపోయిన ప్రజలు చంద్రబాబు ముందస్తు మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ష్యూరిటీలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆసక్తి పెరిగిం దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపల్లె పంచాయతీ మండికాంప్లెక్స్ ప్రాంతంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, మండి కాంప్లెక్స్ అధ్యక్షుడు రోషన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం

జమ్మలమడుగు, జనవరి 5: మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉపకార వేతనాలు (ఆర్థికసాయం) అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ పెద్ద అహోబిలం అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట చౌడేశ్వరీదేవి దేవస్థానం ఆవరణలో వారు మాట్లాడారు. రాయలసీమస్థాయిలో వృత్తి విద్యాకోర్సులలో అత్యధిక మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ పేద విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తామన్నారు. తమ వద్ద పేర్లు నమోదు చేయించుకున్న వారందరు హాజరు కావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజికుంట తిరుమలదాసు, కార్యదర్శి కుండా తిరుమలకొండ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలందరికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కొండాపురం, జనవరి 5 : ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. మండలంలోని ఓబన్నపేట పంచాయితీలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భవ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వరకు వైద్యం చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రజలకు చూపించారు. కార్యక్రమలో మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీలో మడమ తిప్పిన సీఎం'

బద్వేలు రూరల్, జనవరి 5: సీఎం జగన్ ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని మాట ఇచ్చి నేడు మడమ తిప్పాడని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సమావేశంలో చిన్ని మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ నిరుద్యోగ యువతీ యువకులకు తాను అధికారంలోకి వచ్చాక ప్రతి యేటా మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా విడుదల చేయలేదన్నారు. అసలు ఆ ఆలోచన సీఎంకు లేనట్లుందన్నారు. తక్షణమే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, బాలగురయయ, శివకుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

'జయహో బీసీ'లో పోరుమామిళ్ల సర్పంచ్



మంగళగిరిలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల, జనవరి 5: గత రెండురోజులుగా విజయవాడ మంగళగిరిలో జరిగిన పార్టీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడును సీఎంగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు.